జాతీయోద్యమ చైతన్య దీప్తి కొణకంచి

కొణకంచి(పెనుగంచిప్రోలు): జాతీయోద్యమంలో భాగంగా పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామంలోని గ్రంథాలయం నాడు ప్రజల్లో చైతన్య జ్వాలలు రగిలించింది. నాలుగేళ్ల క్రితం ఈ గ్రంథాలయం శతజయంతి ఉత్సవాలను జరుపుకొంది. గ్రామానికి చెందిన కొణకంచి చక్రధర రావు, పురుషోత్తమరావు, కాకుమాను పిచ్చయ్య, నకరికంటి వెంకయ్య, చిర్రావూరి వీరభద్రయ్య తదితరులు 1916 జూలై 18న గ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. దీనికి అధ్యక్షుడిగా కాకుమాను పిచ్చయ్య, కార్యదర్శిగా అయ్యదేవర లక్ష్మీ నరసింహం బాధ్యతలు నిర్వర్తించారు.

బాలభక్త గ్రంథాలయంగా నామకరణం

1926లో ఈ గ్రంథాలయానికి శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయంగా పేరును స్థిర పరిచారు. అధ్యక్షుడిగా రేపాల బుచ్చిరామయ్య శ్రేష్ఠి, కార్యదర్శిగా శ్రీరామ గోవిందశర్మ వ్యవహరించారు. 1930 ఏప్రిల్ 9న గ్రంథాలయ 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలి శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జయంతి పురం రాజు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఎన్‌జీ రంగా, మాగంటి బాపినీడు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖులు చేసిన ప్రసంగాలు ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించాయి. సువిశాల భవనంతో పాటు గ్రంథాలయ ప్రాంగణంలో కళావేదికను ఏర్పాటు చేశారు. 1930లో బుచ్చిరామయ్య శ్రేష్ఠి గ్రంథాలయం నుంచి సుజ్ఞాన ప్రద వంటి పత్రికలు నడిపారు. ఈ పత్రికలు నాడు ప్రజల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగించి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేశాయి. వేల సంఖ్యలో విజ్ఞాన సంపద కొలువు దీరిన ఈ గ్రంథాలయం గ్రామస్తులకు ఓ ఆలయం. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు బుధవారం తెలిపారు.



కొణకంచిలోని శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయం



గ్రంథాలయం నుంచి నడిపిన సుజ్ఞానప్రద ప్రతులు

15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల

కంచికచర్ల: మండలంలోని 16 గ్రామాలకు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల అయ్యాయని, ఆ నిధులను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని బత్తినపాడుకు రూ. 91,181, చెవిటికల్లుకు రూ.3,11,462, గండేపల్లికి రూ.4,18,817, గని ఆత్కూరుకు రూ.3,23,590, గొట్టుముక్కలకు రూ.5,26,563, కంచికచర్లకు రూ.27,03,260, కీసరకు రూ.4,42,388, కొత్తపేటకు రూ.2,37,333, కునికెనపాడుకు రూ.1,24,428, మోగులూరుకు రూ.6,66,548, మున్నలూరుకు రూ.1,13,703, పరిటాలకు రూ.11,58,460, పెండ్యాలకు రూ.8,28,362, పేరకలపాడుకు రూ.1,85,111, వేములపల్లికి రూ.2,57,250. ఎస్.అమరవరానికి రూ.1,31,853 నిధులు విడుదల అయ్యాయని ఎంపీడీఓ వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నందిగామటౌన్: ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ కమిషనర్ రమణబాబు అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



నందిగామటౌన్: విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని న్యాయమూర్తి రియాజ్ అన్నారు. మండలంలోని ఐతవరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, ఎక్కిరాల హనుమంతరావు, దాదా హుసేన్, షేక్ సైదా, కొమ్మినేని మాలేశ్వర రావు, ఆజాద్, ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప దీక్షాధారులు



పెనుగంచిప్రోలు(వత్సవాయి) : పెనుగంచిప్రోలులో గురుస్వామి పులికొండ సాంబశివరావు ఆధ్వర్యంలో గురువారం శంభులింగేశ్వర స్వామి ఆలయంలో 25 మంది అయ్యప్ప దీక్షాధారులు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గురుస్వామి వాసిరెడ్డి బెనర్జీ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

యూటీఎఫ్ అధ్యక్షునిగా ప్రైమర్ సాహెబ్



పెనుగంచిప్రోలు(వత్సవాయి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ అధ్యక్షునిగా షేక్ ప్రైమర్‌సాహెబ్‌ను ఎన్నుకున్నారు. కేవీఆర్ జెడ్పీ పాఠశాలలో గురువారం కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు లీల, సుదానంద్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. ప్రధాన కార్యదర్శిగా భూక్యా రాములు నాయక్, ఉపాధ్యక్షుడుగా బాణావతు వెంకటేశ్వరనాయక్, కోశాధికారిగా మంగినేని రామకృష్ణ, సహాధ్యక్షురాలిగా నిమ్మగడ్డ కుసుమలత, జిల్లా కార్యదర్శిగా చాగర్ల రామారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యలగందల కిషోర్, కార్యదర్శులుగా బిట్రా వెంకటరమణ, బేతపూడి నవకోటి, సీహెచ్ మధు, పాకాలపాటి ఉష, ఎల్.త్రివేణిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు అలక నరసింహారావు, జి ముక్తేశ్వర రావు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలి



నందిగామ టౌన్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో ప్రజలు భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజలు కూడా భాగస్వాములైతే మరింత పారదర్శకంగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఆయా శాఖల నిధుల సమీకరణ అంశాలు, విధి విధానాలపై మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పిచ్చయ్య, మండల పరిషత్ కార్యాలయ అధికారులు రాఘవశర్మ, నాగలక్ష్మి, మనీషా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. సీనియర్, జూనియర్ విద్యార్థులకు శతక పద్యాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలపై దగా

- బడ్జెట్ కేటాయింపుల్లో మొండిచేయి
- అధికారం కోసమే మేనిఫెస్టోలో మోసపూరిత హామీలు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



మీడియా సమావేశంలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తమ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్ కేటాయింపుల్లో మొండిచేయి చూపించి ప్రజలను మరొకసారి దగా చేసిందని, కేవలం అధికారంలోకి రావడానికే మేనిఫెస్టోలో అరచేతిలో వైకుంఠం చూపించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కోదాడ రోడ్‌లోని యోగిరామ్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించడమే కాకుండా, అధికారంలోకి వచ్చిన తరువాత చిత్తశుద్ధితో నూరు శాతం అమలు చేశారని గుర్తుచేశారు. కేవలం సూపర్ సిక్స్ అమలుకే రూ.74 వేల కోట్లు అవసరం కాగా, కేవలం మూడు పథకాలకే అది కూడా అరకొర బడ్జెట్‌ను కేటాయించి ప్రజలను దగా చేశారన్నారు. తల్లికి వందనం పథకానికి రూ.10 వేల కోట్లు అవసరం కాగా, కేవలం 5,200 కోట్లు కేటాయించారన్నారు. అంటే జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి ఒకరికి ఇస్తానన్న అమ్మ ఒడి పథకానికంటే కూడా రూ.1400 కోట్లు తక్కువ కేటాయించారన్నారు. రైతు నిధి కింద ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారని, దాని ప్రకారం 56 లక్షల మంది రైతులకు గాను రూ.10 వేల కోట్లు కావాల్సి ఉండగా, కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఏడాది రూ.6,500 కోట్లు కేటాయించేవారని గుర్తుచేశారు. దీపం పథకానికి, ఉచిత బస్సుకు, నిరుద్యోగ భృతి, యువతకు ఉపాధికి మొండిచేయి చూపించి దగా చేశార న్నారు.

ఉచిత ఇసుక మాటున దోపిడీ

ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు అర్ధరాత్రి భారీ యంత్రాలతో లోడింగ్ చేస్తున్నారని, దీని వెనుకాల ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారని ఆధారాలతో సహా చూపించినప్పటికీ అధికారులు కేసులు కట్టడం లేదని ఆరోపించారు. క్వారీల వలన పొలాలు పాడయిపోతున్నాయని టీడీపీ నాయకులే ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. ఇంత పెద్దఎత్తున అవినీతి జరుగుతుంటే ప్రశ్నించే పార్టీ అయిన జనసేన నాయకులు ఏంచేస్తున్నారన్నారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర చైర్మన్ పదవి కోసం టీడీపీలోకి వెళ్లారన్నారు. పట్టణంలో కుక్కలు ప్రజల ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, న్యాయవాది బూడిద నరసింహారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శామ్యూల్, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు ఉప్పెల్లి పెంటయ్య, సర్పంచ్ సూరిబాబు, గోగుల వెంకయ్య, ఉపేందర్‌రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కంచికచర్ల: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేస్తుందని, ఆ నిధులను గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వీఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని, ప్రజలు రోగాలబారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 104 వాహనం ద్వారా రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి, బ్లీచింగ్, సున్నం చల్లించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, పశు వైద్యుడు ఏడుకొండలు, పరిటాల, కీసర, పెండ్యాల, మోగులూరు, వేములపల్లి, ఎస్.అమరవరం, మున్నలూరు, కునికెనపాడు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న ఏపీడీ పార్థసారథి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఏపీడీ కె.పార్థసారథి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో జరిగిన పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. రూ.18.55 కోట్ల పనులు జరిగాయని, ఇందులో రూ.16.10 కోట్లను కూలీల వేతనాలుగా చెల్లించారని, మెటీరియల్ పేమెంట్‌గా రూ.2.45 కోట్లు చెల్లించారని వివరించారు. అయితే గ్రామాల్లో మస్టర్‌లు, కూలీల చెల్లింపుల్లో తేడాలున్నట్లు ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామ సభలో గుర్తించి రూ.2.50 లక్షలు రికవరీ చేసినట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీల మస్టర్‌లు వేయటంలో నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, డీపీవో విజయలక్ష్మి, ఎస్‌ఆర్‌పీలు పున్నమినాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

జగ్గయ్యపేటఅర్బన్: భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూచౌక్‌లోని నెహ్రూ విగ్రహానికి పలు రాజకీయ పార్టీల నేతలు, సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

పట్టణంలోని కోదాడ రోడ్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్‌లో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాచేపల్లి వీరభద్రరావు, సన్నె రామారావు, ఎస్‌డీ ఖాజా, భోజనపల్లి కామేశ్వరరావు పాల్గొన్నారు.
- **మండలంలో బాలల దినోత్సవం**

మండలంలోని గండ్రాయి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- **విజ్ఞాన్ విద్యా సంస్థలో...**

స్థానిక విజ్ఞాన్ విద్యా సంస్థల్లో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా చిత్ర లేఖనం, డిబేట్, వ్యాసరచన తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి బహుమతులను అందజేశారు.

చిల్లకల్లులో న్యాయ విజ్ఞాన సదస్సు...

బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని చిల్లకల్లులో ప్రభుత్వ కళాశాలల బీసీ బాలుర హాస్టల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం న్యాయమూర్తి ప్రాంగణంలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు



చిల్లకల్లులోని బీసీ హాస్టల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శోభారాణి



గండ్రాయిలోని స్కూల్‌లో బాలల దినోత్సవం

ఘనంగా బాలల దినోత్సవం

వత్సవాయి: జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను గురువారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. వత్సవాయి, కన్నెవీడు, గోపినేనిపాలెం, కంభంపాడు, పోలంపల్లి తదితర పాఠశాలల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్.నాగరాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు జెడ్పీ పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం జలజ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

తొలి ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

నందిగామ టౌన్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం జవహర్ లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చందాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో బాలల దిన వేడుకలు జరిగాయని ఎంఈఓ బి.బాలాజీ గురువారం తెలిపారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలల దినోత్సవం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



నందిగామ గాంధీ సెంటరులో ధర్నా చేస్తున్న పార్టీ నాయకులు



పేట మున్సిపల్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నందిగామటౌన్: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీ సెంటరులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేయాలని, 18వ వార్డులో నివాసితుల ఇళ్లకు పట్టాలు అందించాలని కోరారు. మహిళలు, పిల్లలు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశీం, గోపీ నాయక్, కరి వెంకటేశ్వరరావు, బచ్చలకూరి లాజర్, పుల్లయ్య, ఏడుకొండలు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో మండల సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని, మహిళలు, పిల్లలపై విచ్చలవిడిగా అత్యాచారాలు, వేధింపులు నిత్యకృత్యం అయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ గౌస్‌మియా, దంతాల వెంకటేశ్వర్లు, రామనాథం, దాసరి నాగేశ్వరరావు, లింగారావు, కోటా రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడులో...

నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం కనీసం పట్టించుకోవటం లేదని సీపీఎం నాయకులు అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ గురువారం ర్యాలీ చేసి తహసీల్దార్ హుసేన్‌కు వినతిపత్రం అందజేశారు.

వత్సవాయిలో...

వత్సవాయి: ట్రూఅప్‌ల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం వత్సవాయిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రూఅప్ పేరుతో రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. పలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి బి.రాము, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

100 మద్యం సీసాలు పట్టివేత



కంచికచర్ల: బెల్టుషాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ అఫ్రష్నీశా బేగం హెచ్చరించారు. మండలంలోని మోగులూరులో ఎక్సైజ్ శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు బెల్టు దుకాణాలు నిర్వహించి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 100 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించి మద్యం అమ్మితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

తాగునీటి బోర్లు మరమ్మతులు చేయండి



జగ్గయ్యపేట: మండలంలోని తాగునీటి బోర్లు మరమ్మతులకు గురై పలు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. 21 సచివాలయాల పరిధిలో 550 సాగునీటి బోర్లు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం వేసవి కాలాన్ని తలపిస్తుండటంతో పలు గ్రామాల్లో బోర్లు పనిచేయటం లేదు. అనుమంచిపల్లి, షేర్ మహ్మద్‌పేట, తిరుమలగిరి, చిల్లకల్లు, గండ్రాయి, కె.అగ్రహారం గ్రామాల్లోని తాగునీటి బోర్లు గత రెండు నెలలుగా పని చేయకపోతుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా షేర్ మహ్మద్‌పేట, చిల్లకల్లు గ్రామాల్లోని ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు తాగునీటి బోర్లే ఆధారం. అయితే ఆయా గ్రామ పంచాయతీల అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

పెనుగంచిప్రోలు(వత్సవాయి) : గ్రంథాలయాలు జ్ఞాన జ్యోతులను వెలిగించే దేవాలయాలని పలువురు వక్తలు తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రం కొణకంచి, పెనుగంచిప్రోలులోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవి, ఆయుర్వేద వైద్యాధికారి కొల్లూరి శ్రీవాణి, జెడ్పీ హెచ్‌ఎం రమణ తదితరులు పాల్గొన్నారు.